హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి తమగోడు వెళ్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తమ సమస్యలను చెప్పుకుంటున్న హైదర్‌గూడ మూసీ బాధితులు

రాష్ట్రం నుంచి ఢిల్లీకి 25వేల కోట్లు!

కుర్చీ కోసం ఢిల్లీ పెద్దలకు రేవంత్ నజరానా ● అందుకే లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్టు

- బఫర్‌జోన్ అని మూసీ వెంట మార్కింగ్..
- మరి దుర్గం చెరువు ఎఫ్‌టీఎస్‌లో ఉన్న రేవంత్ సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చరు?
- పేదలను ముంచే సుందరీకరణ ఎందుకు?
- పేదల ఇండ్లను మూసీలో కలుపుతుంటే బీజేపీ నేతలు నోరెందుకు తెరువరు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మూసీ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతల పర్యటన

హైదర్‌గూడలో మూసీ బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎంపీ రవిచంద్ర, మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు గోపీనాథ్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు

హైదర్‌గూడలో మాట్లాడుతున్న మూసీ బాధితురాలు రేణుక. చిత్రంలో కేటీఆర్, మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి తదితరులు

హైదర్‌గూడలో కేటీఆర్‌తో మాట్లాడుతున్న మూసీ బాధితులు. చిత్రంలో మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : మూసీ పేరిట ఢిల్లీ పెద్దలకు రూ.25 వేల కోట్లు ఇచ్చేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఆరాటపడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కోట్ల విలువజేసే ఆస్తులకు డబుల్ బెడ్రూం ఇండ్లను పరిహారంగా ఇవ్వాలనుకోవడం కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గమైన చర్యలకు నిదర్శనమని నిప్పులు చెరిగారు. రెక్కల కష్టంచేసి కట్టుకున్న ఇండ్లను కూల్చివేసేందుకు వస్తున్న రేవంత్‌రెడ్డికి ఆడబిడ్డల ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన హైదర్‌గూడలోని లక్ష్మీనగర్, బహదూర్‌పురాలోని కిషన్‌బాగ్ ప్రాంతాల్లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మహమూద్ ఆలీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి కేటీఆర్ సోమవారం పర్యటించారు. మూసీ వెంట మార్కింగ్ జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి బాధితుల గోడు విన్నారు. పేదల ఇండ్లను మూసీలో కలిపే సుందరీకరణ ఎందుకు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం సీటును కాపాడుకునేందుకు రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు రూ.25 వేల కోట్ల నజరానా ఇచ్చేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. పేదల గూడులను కూల్చేసే మూసీ ప్రాజెక్టుతో ఎవరికీ ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. బఫర్‌జోన్ పేరిట మూసీ వెంట మార్కింగ్ చేస్తున్న రేవంత్‌రెడ్డి, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఆయన సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చడం లేదని నిలదీశారు. ఓవైపు బుల్డోజర్ రాజ్యానికి తావు లేదని రాహుల్ గాంధీ చెప్తుంటే.. మరోవైపు రేవంత్‌రెడ్డి తెలంగాణలో బుల్డోజర్లు దింపుతున్నాడని మండిపడ్డారు. రాహుల్ ఏమో చౌకీదార్ చోర్ అంటుంటే.. మోదీ తన పెద్దన్న అంటూ రేవంత్ ఆలింగనం చేసుకుంటాడని, కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి తెలంగాణ సాక్ష్యంగా మారిందని చెప్పారు. పేదల ఇండ్లను మూసీలో కలుపుతుంటే బీజేపీ నాయకులు ఎక్కడికి పోయారని, ఏ ఒక్కరూ నోరెందుకు తెరవడం లేదని అసహనం వ్యక్తంచేశారు. పేదల ఇండ్లకు తామే అడ్డుగా నిలబడతామని భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల భూములను లాక్కొంటున్న రేవంత్‌రెడ్డి, మన్మోహన్‌సింగ్ తెచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూసీ పేరిట జరుగుతున్న బాగోతాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని, బాధితుల పక్షాన పోరాడుతుందని స్పష్టంచేశారు.

కిషన్‌బాగ్‌లో కేటీఆర్ పర్యటన సందర్భంగా భారీగా తరలివచ్చిన మూసీ బాధితులు

నిర్మాణరంగంలో తీవ్ర సంక్షోభం

ప్రభుత్వ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు పడక ● 'హైడ్రా'తో ప్రైవేటు నిర్మాణాలు బంద్

భయంలో ఇండ్ల కొనుగోలుదారులు ● ఉత్పత్తి నిలిపేస్తున్న సిమెంట్ కంపెనీలు

కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో స్టోన్ క్రషర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులు, భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిగా పడకేశాయి. దీనికితోడు హైడ్రా కూల్చివేతలతో బిల్డర్లు నిర్మాణాలను నిలిపివేయగా.. ఇండ్ల కొనుగోలుదారులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో నిర్మాణ రంగానికి సంబంధించిన పరిశ్రమల ఉనికి ప్రశ్నార్థంగా మారింది. ఇప్పటికే సిమెంట్, కంకర, రెడీమిక్స్ విక్రయాలు దాదాపు 50% మేరకు పడిపోవడంతో పలు పరిశ్రమలు తమ ఉత్పత్తులను నిలిపివేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణ రంగం ఉత్పత్తుల విక్రయాలు 40 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా సిమెంట్ విక్రయాల్లో గణనీయంగా తగ్గుదల నమోదు కావడంతో కొన్ని కంపెనీలు తమ ఉత్పత్తులను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొవిడ్ సంక్షోభం నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయని, 6 నెలలుగా పరిస్థితి ఘోరంగా మారిందని పరిశ్రమ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పదేండ్లపాటు తెలంగాణ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందడంతోపాటు, పలు జాతీయ అవార్డులను కూడా సొంతం చేసుకున్నది. భారీ నీటిపారుదల ప్రాజెక్టులతోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకోవడంతో ఇసుక, సిమెంట్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వమే లక్షల టన్నుల సిమెంట్‌ను కొనుగోలు చేసింది. ఆ తర్వాత తెలంగాణలో ప్రభుత్వం మారడంతో అభివృద్ధికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లను కూల్చివేస్తుండటం, నిర్మాణ అనుమతుల్లో విపరీతంగా అవినీతి పెరిగిపోవడంతో బిల్డర్లు తమ ప్రాజెక్టులను నిలిపివేశారు. మరోవైపు, కొనుగోలుదారులు సైతం ఏ భవనం సక్రమమో, ఏ భవనం అక్రమమో, ఏ భవనాన్ని ఎప్పుడు కూల్చివేస్తారో తెలియక తీవ్ర గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఇండ్ల విక్రయాలు అమాంతం పడిపోయాయి. దీంతో సిమెంట్ పరిశ్రమలు, స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీలు, రెడీమిక్స్ ప్లాంట్ల ఉనికి ప్రశ్నార్థంగా మారింది. పనులు దొరక్క లక్షల మంది కార్మికులు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోతున్నారు.

ఉత్పత్తి నిలిపివేస్తున్న సిమెంట్ కంపెనీలు

డిమాండ్ లేక టన్ను సిమెంట్ ధర రూ.వెయ్యికి క్షీణించిందని, దీంతో విక్రయాలు జూలైలో 40%, ఆగస్టులో 30 శాతానికిపైగా పడిపోయాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఉత్తర తెలంగాణలోని ఓ ప్రముఖ సిమెంట్ కంపెనీ జూలైలో 10 రోజులు, సెప్టెంబర్‌లో 12 రోజులపాటు ఉత్పత్తిని నిలిపివేసిందని, మిగిలిన కంపెనీలు సైతం తమ ఉత్పత్తులను 40% మేరకు తగ్గించుకున్నాయని చెప్తున్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లు బంద్

రెడీమిక్స్ ప్లాంట్లు కూడా తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. ప్రభుత్వంతోపాటు బిల్డర్ల నుంచి బిల్లులు రాకపోవడం, ప్రైవేటు బిల్డర్ల నుంచి కూడా గిరాకీ లేకపోవడంతో ఇప్పటికే పలు ప్లాంట్లను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఆర్ఎంసీ పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. గత 3 నెలల్లో ఆర్ఎంసీ విక్రయాలు 40% మేరకు పడిపోయినట్టు తెలిపాయి.

స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీల మూత

నిర్మాణ రంగం సంక్షోభ ప్రభావం స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీలపై కూడా పడింది. రాష్ట్రంలోని దాదాపు 470 స్టోన్‌క్రషర్లలో ఇప్పటికే చాలా మూతబడినట్టు తెలుస్తున్నది. ఆర్డర్లు లేక కంకర, రోబో శాండ్ నిల్వలు పేరుకుపోవడం, గత 3 నెలల్లో విక్రయాలు 50 శాతానికిపైగా పడిపోవడం, కరెంటు బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడం ఇందుకు కారణమని స్పష్టమవుతున్నది. మిగిలిన క్రషర్లలోనూ తరచుగా ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్టు ఆ పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, గత 3 నెలల్లో ఇటుకల విక్రయాలు కూడా 50% మేరకు పడిపోవడంతో ఇప్పటికే చాలా బట్టీలను మూసేసినట్టు వాటి యజమానులు తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి తెలంగాణకు వచ్చే ఇటుక కూడా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రస్తుతం తమ వద్ద పేరుకుపోయిన నిల్వలను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

సొమ్ముల సంగతి తర్వాత.. ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లే పోయేటట్టుంది!

కాంగ్రెస్, బీజేపీ చీకటి స్నేహం?

కేంద్రంలో పోరాటం.. రాష్ట్రంలో చెట్టపట్టాల్

రేవంత్ ప్రజావ్యతిరేక విధానాలపై బీజేపీ మౌనం

రాష్ట్రంలో పరిణామాలపై పరిశీలకుల అభిప్రాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అక్కడ కయ్యం, ఇక్కడ వియ్యం అన్నట్టుగా రెండు ప్రధాన జాతీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని తెలంగాణలో రోజువారీ పరిణామాలను గమనిస్తున్న పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రంలో బద్ధ విరోధులుగా ఉంటున్న కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రంలో మాత్రం స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నట్టున్నాయని పేర్కొంటున్నారు. పది నెలల పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నా బీజేపీ ఇంతవరకు స్పందించకపోవడం అనుమానాస్పదంగా ఉన్నదని అంటున్నారు. హైడ్రాకు వికృతరూపమిచ్చి పేదల ఇండ్ల మీదికి వదలడంతో వందల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. రూ 2 లక్షల రుణమాఫీ కోసం లక్షల మంది రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా అందక, అప్పు పుట్టక రైతన్నలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద ఒక్క విమర్శ కూడా చేయకపోగా.. ఏ అధికారమూ లేని బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శించటం పట్ల స్వయంగా ఆ పార్టీల శ్రేణులే విస్మయం వ్యక్తంచేస్తున్నాయి.

బంధానికి అనుమానాలెన్నో

అమృత్ స్కీం టెండర్లలో జరిగిన కుంభకోణాన్ని బహిర్గతం చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాధ్యులను చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు సైతం ఆయన ఆధారాలతో సహా లేఖ రాశారు. ఈ విషయంలో మొదట్లో కొంత హడావుడి చేసినట్టు కనిపించినా బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆ తరువాత మౌనం దాల్చారు. ఇక హైదరాబాద్‌లో హైడ్రా ఆగడాలతో పేదలు గూడులేని పక్షలుగా మారిపోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నా బీజేపీ నేతలు మాత్రం స్పందించలేదు. చివరికి తాము ఎక్కడ వెనుకబడిపోతామోనన్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం స్పందించారు. చెరువులు, కుంటలను ఆక్రమించి సంపన్నులు నిర్మించిన భవనాలను హైడ్రా కూల్చివేస్తుందని భావించామని, కానీ పేద, మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చి వాళ్లకు నిలువ నీడలే కుండా చేస్తున్నదని విమర్శించారు.

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచిపోయింది. ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు మినహా ఏ గ్యారెంటీని అమలు చేయలేదు. ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపలేదు. ఫలితంగా 9 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేస్తున్నారు. ప్రజాభవన్ సాక్షిగా ఒక ఆటోడ్రైవర్ తన ఆటోను తగులబెట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈ పరిణామాలపై బీజేపీ పల్లెత్తు మాట మాట్లాడకపోవడమే కాకుండా అసలది సమస్యే కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నది.
- రాష్ట్రంలో ఇంకా 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కానేలేదు. కాంగ్రెస్ పాలన 10 నెలల మైలురాయిని దాటకమందే రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు 300 మార్కును దాటేశాయి. దీనిపై బీఆర్ఎస్ వీధి పోరాటాలు, ధర్నాలు, రస్తారోకోలు చేస్తున్నది. ఈ విషయంలో మొదట్లో కొంత హడావుడి చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆ తరువాత మిన్నకుండిపోయారు. ప్రతి జిల్లాలో రైతుల ఆందోళనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో.. ఇంతకాలం మౌనం వహించిన బీజేపీ నేతలు తప్పనిసరి పరిస్థితిలో సోమవారం రైతుల పక్షాన నిరసన దీక్ష చేపట్టారు.
- రాష్ట్రంలో బియ్యం టెండర్లలో రూ.1100 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ అసెంబ్లీ లోపలా, బయటా ఆధారాలతో సహా వెల్లడించింది. ప్రభుత్వం స్పందించకపోవటంతో ప్రజాధనాన్ని కాపాడాలనే ఉద్దేశంతో హైకోర్టును సైతం ఆశ్రయించింది. తొలుత ఈ వ్యవహారాన్ని బయటపెట్టిందే తామేనన్నట్టు, పేటెంట్ తమదే అన్నట్టు చెప్పుకున్న బీజేపీ నేతలు నాలుగైదు మీడియా సమావేశాలు పెట్టి ఆ తరువాత చడీచప్పుడు లేకుండా ఉండిపోవడం అనుమానాలకు తావిస్తున్నది.
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు కొత్తచట్టాలను ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్యపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఆ చట్టాల అమలు విషయంలో పునరాలోచించాలని కేంద్రానికి లేఖలు రాశాయి. ఈ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం ఆ చట్టాలను అమలు చేస్తున్నది.
- ఇటీవలి భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మం పట్టణంలో ప్రభుత్వం పునరావాస, సహాయక చర్యలను గాలికి వదిలేసింది. దీనిపై బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట కూడా అనలేదు. దీంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డితో బీజేపీ మైత్రిబంధం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బహిరంగ రహస్యమైందనే చర్చ సాగుతున్నది. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసిన బండి సంజయ్ సునాయాసంగా గెలవటానికి వీలుగానే అక్కడ కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందనే ఆరోపణలువచ్చాయి.

నాడు అధికారులకు తెల్వదా

పైసాపైసా కూడబెట్టుకొని పేదలు భూములు కొని ఇండ్లు కట్టుకున్నరు. ఈ స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉన్నదా? బఫర్ జోన్‌లో ఉన్నదా? అనేది నాడు అధికారులకు తెల్వదా? ఎట్ల పర్మిషన్లు ఇచ్చిండ్రు? కరెంటు, మంచినీటి బిల్లులు ఎట్ల ఇచ్చిండ్రు? ఇవన్నీ లెక్కలోకి తీసుకోకుండా కూల్చడం మంచి పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం మూసీ సుందరీకరణ, కూల్చివేతల నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి.

-వనం నర్సింహ, నందనవనం, హైదర్‌గూడ

ఈ దుస్థితి ఎవరికీ రావద్దు

ప్రజలను కష్టాలపాల్జేయడమే ప్రజాపాలనా? ప్రజలు బిక్కుబిక్కుమని బతికే పరిస్థితి తెచ్చిండ్రు.చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రుల బాధలు, కన్నీళ్లు చూడలేకపోతున్నం. ఆడోళ్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నరు. ఇలాంటి దుస్థితి ఎవరికీ రావద్దు.

-అప్పారెడ్డి ముఖేశ్, అత్తాపూర్

కాంగ్రెస్ నాయకులు చోద్యం చూస్తాండ్రు

మేమంతా తిండెక్కువై రోడ్లమీదికి వస్తలేం.. అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నం. కాంగ్రెస్ పెద్దలు ఒక్కరు కూడా బయటకొచ్చి మా మంచిచెడ్డలు చూస్తలేరు. ఇండ్లళ్ల కూర్చొని చోద్యం చూస్తున్నరు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తమంటున్నరు. వాటిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు ఉండాలి. అప్పుడు మేం కూడా వచ్చి ఉంటం. మా కాయకష్టంతో కట్టుకున్న ఇంటిని వదిలి వెళ్లేందుకు ఏమాత్రం ఒప్పుకోం.

- త్రినాథ్, అత్తాపూర్

సచ్చుడో.. బతుకుడో తెలుస్తలేదు

మా పరిస్థితి సచ్చుడో.. బతుకుడో తెలుస్తలేదు. మంచి చేస్తమని నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచుతున్నరు. పేదలను ఇబ్బంది పెట్టుడు తప్ప మంచి చేయాలని రేవంత్‌రెడ్డికి లేనట్టున్నది. తినే తిండి కూడా కడుపులకు పోతలేదు. మా పరిస్థితి తలుచుకుంటే కండ్ల నీళ్లు ఆగుతలెవ్వు. -రేణుక, అత్తాపూర్

ఇక్కడ బత్కాలంటే భయమైతాంది

ఇక్కడ బత్కాలంటే భయమైతాంది. రోజుకొకడు వచ్చి వేధిస్తున్నరు. ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నరు. మా ఆయన చిన్న ఉద్యోగం చేసి రిటైర్డ్ అయితే వచ్చిన డబ్బుతో చిన్న ఇల్లు కట్టుకున్నం. అప్పుడు కాంగ్రెస్సే ఉన్నది. మరి అప్పుడెట్ల పర్మిషన్ ఇచ్చిండ్రు? మేం కష్టపడి కట్టుకున్న ఇంటిని ఉన్నపళంగా కూల్చేస్తామంటే ఏడికి పోవాలె? మా పాణం పోయినా ఈన్నే ఉంటం.

-చంద్రకళ, వృద్ధురాలు, అత్తాపూర్